# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.
- ❖ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వెల్లడించారు.
- ❖ ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేథ (ఏఐ) వినియోగం పెరగాలని, గ్రీవెన్సులు సత్వరంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.
- ❖ రాష్ట్ర సమగ్రభివృద్ధికై సమిష్టిగా పని చేయాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు.
- ❖ ఆంధ్రప్రదేశ్‌లో టెంపుల్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

=============================

రాష్ట్ర వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు, రాజధాని కోసం భూములిచ్చిన రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరేడ్‌లో పాల్గొన్న 11 దళాల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర ప్రగతిని చాటేలా 22 శకటాలను ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

=============================

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వెల్లడించారు. అమరావతిలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ... సాంకేతికత ద్వారా క్షణాల్లో పాలన ప్రజలకు చేరేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని, కలిసికట్టుగా ఆరోగ్య, ఆనంద, సౌభాగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. అమరావతిలో తొలిసారి జాతీయ జెండాను ఎగురవేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు గవర్నర్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగాలని, దాని వలన గ్రీవెన్సులు సత్వరంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల అధికారులతో ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష ఈరోజు నిర్వహించారు. సాంకేతికతను ఉద్యోగులు, అధికారులు విస్తృత స్థాయిలో వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. 2026 సంవత్సరం “టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్” సంవత్సరంగా మారాలని స్పష్టం చేశారు. మన మిత్ర - వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటివరకు కోటీ 43 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

==============================

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, సుభిక్షమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరం కలిసికట్టుగా పని చేయాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్ద ఈరోజు మువన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ.. చట్టసభల గౌరవాన్ని పెంచుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన బాధ్యత శాసనసభ్యులకు ఉందని పేర్కొన్నారు.

==============================

ఆంధ్రప్రదేశ్ లో టెంపుల్ టూరిజం (దేవాలయాల పర్యాటకం)ను మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో భక్తుల కోసం మొదటిసారిగా వివిధ సౌకర్యాలతో పర్యాటక శాఖ రూపొందించిన కారవాన్ వాహనాన్ని ఈరోజు నెల్లూరులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు గొప్ప అనుభూతిని అందించేందుకు ఈ క్యారవాన్ కు పర్యాటక శాఖ శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు భాగస్వామ్యంతో పలు కారవాన్‌లను ప్రారంభించి పుణ్యక్షేత్రాలకు అనుసంధానం చేస్తామన్నారు.

==============================

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ లోక్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం జరిగింది. గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అతిథులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కె. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్.సవిత, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, జడ్జీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

విరామం

==============================

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిలో 25 రాకెట్ ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ పద్మకుమార్ తెలిపారు. తిరుపతి జిల్లాలో శ్రీహరికోటలోని షార్ లో ఏర్పాటు చేసిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆయన మాట్లాడుతూ... గగన్ యాన్ మిషన్ ప్రాజెక్ట్ లో భాగంగా ఈ ఏడాదిలో గగన్ యాన్ G1, G2, G3 ప్రయోగాత్మక రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా PSLV C-61, C-62 రాకెట్ ప్రయోగాలు విఫలానికి గల సాంకేతిక లోపాలను అన్వేషిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి లేదా మార్చిలో GSLV-F-17 రాకెట్ ప్రయోగం నిర్వహిస్తామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

==============================

సముద్ర జలాల్లో దేశ ప్రయోజనాలను కాపాడటంలో తూర్పు నౌకాదళం (ఈఎన్‌సీ) అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని వైస్ అడ్మిరల్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ సంజయ్ భల్లా పేర్కొన్నారు. విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళం ప్రధాన కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆయన మాట్లాడుతూ... తీర ప్రాంత భద్రతను నిరంతరం సమీక్షిస్తూ, పటిష్టం చేస్తున్నామని.. ఏవైనా సవాళ్లు ఎదురైతే తక్షణమే స్పందించేలా సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. “ఆత్మనిర్భర భారత్” లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ పరిజ్ఞానంతో నౌకాదళ సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నామని వెల్లడించారు. వచ్చే నెల 18న విశాఖ వేదికగా జరగనున్న “ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ”లో 140 దేశాల ప్రతినిధులు హాజరవుతారని, ఈ వేడుకలో భారత్ సొంతంగా తయారు చేసిన యుద్ధ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

==============================

అనకాపల్లి జిల్లాలోని ఉపమాక ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ రోజు ఉపమాక ఆలయాన్ని సందర్శించిన ఆమె.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి వార్షిక కళ్యాణోత్సవం నేపథ్యంలో.. ఆలయం వద్ద అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 27న ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణం జరుగుతుందని తెలిపారు. ఆలయానికి 6 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.

==============================

ప్రాణాలు పణంగా పెట్టి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన త్యాగధనుల ఆశయాలను అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జాతీయ పతాకాన్ని మంత్రి ఈరోజు ఆవిష్కరించారు.

==============================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాంలో ఈరోజు, రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

==============================
==============================